ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 45, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 50, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 60, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 21, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 50, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అవార్డుల ప్రదానం

రసూల్‌పురా: సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులను శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డులతో సత్కరించారు. గురువారం టివోలి గార్డెన్‌లో జరిగిన ఈ అవార్డు కార్యక్రమానికి సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ సిద్ధాంతికవేత్త ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విశిష్ట అధ్యాపకులు డా.ముతుకుపల్లి విద్యాసాగర్, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డా.నాగేశ్వర్‌రెడ్డికి నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం సిటిజన్ అవార్డులతో సత్కరించారు. అనంతరం జస్టిస్ రామసుబ్రమణీయన్ మాట్లాడుతూ.. శివానంద మూర్తి ఆశయాలను కొనసాగిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. మహోన్నత వ్యక్తులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. ట్రస్టీ రాజ్ కందుకూరి మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం తన తండ్రి సద్గురు శివానందమూర్తి ఆదేశాలతో ట్రస్టు ఏర్పాటు చేసి మహోన్నత వ్యక్తులను సన్మానిస్తున్నామని ఇప్పటివరకు 126 మంది ప్రముఖులను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్. సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఐఏఎస్ జేఎస్‌వీ. ప్రసాద్, చివుకుల మురళి కృష్ణ, గోపాల్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.


అవార్డులు అందజేస్తున్న దృశ్యం

ఆలయాలు ముస్తాబు..

- ముక్కోటి ఏకాదశికి దేవాలయాలు సిద్ధం
- సౌకర్యాలు కల్పిస్తున్న నిర్వాహకులు

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు


ఉత్తర ద్వార దర్శనానికి ఏడు ద్వారాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం


కల్యాణ వెంకన్నస్వామి ఆలయం

చిలకలగూడ: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంకన్నస్వామి ఆలయాలను పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23, 24వ తేదీలలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం, పూజలు, అభిషేకాలు, సర్వదర్శనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలలో సుమారు లక్షన్నర మంది పాల్గొనే అవకాశం ఉందని, జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, విద్యుత్ తదితర విభాగాల సమన్వయ సహకారాలతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రత్యేక ఆకర్షణగా తిరుపతి సెట్టింగ్..

నామాలగుండు కల్యాణ వెంకన్నస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా తిరుమల తిరుపతి దేవస్థానం సెట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు.



ఆలయం లోపల ఉత్తర ద్వార దర్శనం కోసం ఏడు ద్వారాలు, వెంకన్నస్వామి భారీ సెట్టింగ్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

నామాల ఆకారంలో స్వామివారు..

ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతంలో పెద్ద బండరాళ్లు (గుండు) ఉండేది. మూడు రాళ్లు కలిసి నామాల ఆకారంలో ఉండడంతో ఈ ప్రాంతానికి నామాలగుండు అనే పేరు వచ్చింది. ఈ గుండును సాక్షాత్తు కలియుగ వెంకన్న స్వామి ప్రతిరూపంగా భక్తులు కొలిచేవారు. పూర్వకాలం నుంచే పూజలు అందుకుంటున్న గుండుకు ఏటా తొలి ఏకాదశి రోజున సున్నం, జాజుతో నామాలు అద్ది ప్రత్యేక పూజలు చేసేవారు. ఈక్రమంలో గుండును యథావిధిగా ఉంచి చుట్టూ స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. టీటీడీ నిర్వహించే కైంకర్యాలన్నీ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో కొద్ది రోజుల్లోనే ప్రసిద్ధి పొందింది.

◆ మల్కాజ్‌గిరికి చెందిన పుప్పాల శ్రీరాములు, మంజుల దంపతులు గురువారం వెంకన్నస్వామికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

భక్తిభావం పెంపొందించేందుకే..



ప్రజల్లో ఆధ్యాత్మిక భక్తి భావాన్ని పెంపొందించేందుకు తనవంతు కృషి చేస్తున్నాం. ప్రతిఏటా వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. ఉత్తర ద్వార దర్శనానికి సుమారు లక్షన్నర మంది భక్తులు వస్తారనే అంచనాతో తగిన ఏర్పాట్లు చేపట్టాం. కోవిడ్ కేసులు పెరుగుతున్న క్రమంలో భక్తులంతా మాస్క్ ధరించి సహకరించాలి.

– నోముల ప్రకాశరావు, ఆలయ చైర్మన్

సనత్‌నగర్ నియోజకవర్గంలో..

సనత్‌నగర్: వైకుంఠ ఏకాదశి పర్వదిన ఉత్సవాలకు సనత్‌నగర్ నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు నిర్వాహకులు ముస్తాబు చేశారు. వైకుంఠ ఏకాదశిని వైభవోపేతంగా నిర్వహించడం సనత్‌నగర్ దేవాలయ ప్రత్యేకతగా చెబుతుంటారు. ఆ క్రమంలో సప్తద్వారల మీదుగా ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు షురూ అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ, ఏడు ద్వారతో అలంకరించిన ఉత్తర ద్వారంలో దర్శనం, విశేష పూజలు జరుగుతాయని ఈఓ శ్రీనివాసరాజు, ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు తెలిపారు.

◆ ఎస్‌ఆర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని వేంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు చేశారు.

శివాజీనగర్‌లో..

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని చరిత్రాత్మకమైన పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఈవో సత్యమూర్తి, చైర్మన్ వై నర్సారెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దేవాలయ ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని వైష్ణవ సాంప్రదాయాల ప్రకారం దేవాలయంలో పూజలు జరుగుతాయని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు చేశామని, మంచినీళ్లు, ప్రసాదాలు అందిస్తామన్నారు.



ముస్తాబైన బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని దేవస్థానం

జగన్ మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గాంధీఆస్పత్రి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వరగుప్తా ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ వాల్యాలతో కలిసి ఇన్ పేషెంట్ విభాగాల్లో చికిత్స పొందుతున్న వందలాది మంది రోగులకు పలు రకాల పండ్లు అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వర గుప్తా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించి అనేక సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టామని, మరోమారు ఆయనే సీఎం కావాలని కోరుతూ పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

బల్కంపేట ఆలయంలో పూజలు..

సనత్‌నగర్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తడక జగదీశ్వర్‌గుప్తా బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఏపీ సీఎం ఆయురారోగ్యాలతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుభిక్ష పాలన అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిందిగా అమ్మవారిని వేడుకున్నట్లు తడక జగదీశ్వర్‌గుప్తా తెలిపారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికి కార్యాచరణ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో ధ్వంసమైన రోడ్ల స్థానంలో నూతన రహదారులు నిర్మించేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. శ్రీనివాసనగర్, వేంకటేశ్వరనగర్, ఫ్రైడే మార్కెట్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆమె పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేంకటేశ్వరనగర్‌కు సీసీ రోడ్డు మంజూరైందని త్వరలోనే పనులు చేపడతామన్నారు. ఐదు ప్రాంతాల్లో అంతర్గత రహదారులకు నిధులు మంజూరు కాగా, మరో ఐదు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం పంపినట్లు వివరించారు.

బస్తీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. నాగరాజరాజేశ్వరినగర్ కాలనీతో పాటు కైలాస్‌నగర్ నుంచి స్వామి టాకీస్ వరకు వీడీసీసీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలను బాల్‌రెడ్డి, భోగిబాలరాజ్, అన్వర్, ఓంప్రకాష్, శర్మ, చక్రవర్తి, ఒమర్, గణేష్ పాల్గొన్నారు.

ఓయూలో ఇనుప కంచె తొలగింపు


కంచెను తొలగిస్తున్న సిబ్బంది


సీఐ ఆంజనేయులుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న విద్యార్థి నాయకులు

సీఐ ఆంజనేయులుకు అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని పాలన భవనం చుట్టూ ప్రహరీ పై ఏర్పాటు చేసిన ఇనుప కంచెను ఎట్టకేలకు తొలగించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థుల ఆందోళన ఫలితంగా గురువారం అధికారుల ఆదేశాల మేరకు ఓయూ సీఐ ఆంజనేయులుతో పాటు సెక్యూరిటీ ఆఫీస్ రాహుల్ సమక్షంలో కంచెను తొలగించారు. ముళ్లకంచె తొలగింపునకు ఓయూ అధికారులకు విద్యార్థి నేతల నడుమ వారధిగా ఉండి కంచె తొలగింపునకు కృషి చేసిన సీఐ ఆంజనేయులుకు విద్యార్థి నేతలు వలిగొండ నరసింహా, అర్జున్, పార్థు, మనోహర్, సాగర్ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కోట నీలిమకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

సనత్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ కార్యకర్తలు కీలకంగా వ్యవహరించాలని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆమెను కలిసిన సందర్భంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె వారికి పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, వారి మద్దతుదారులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందాయని, అలా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కోట నీలిమను కలిసిన వారిలో చిరంజీవి, నరేష్, మల్లికార్జున్, అమనుల్లాఖాన్, కృష్ణకుమార్ ఉన్నారు.

సమాజంలో దివ్యాంగుల పాత్ర కీలకం


దివ్యాంగుల ర్యాలీలో పాల్గొన్న గౌతంరావు, కావ్యా కిషన్ రెడ్డి

కాచిగూడ: సమాజంలో దివ్యాంగులు సాధిస్తున్న విజయాలు మనందరికీ ఆదర్శనీయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి బర్కత్‌పుర చమన్ వరకు వికలాంగుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య జి.కావ్యా కిషన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు ఆర్థిక, సామాజికంగా వృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. సమాజంలో వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ సహాయ గుణంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికలాంగుల రిజర్వేషన్లు మూడు శాతం నుంచి నాలుగు శాతం పెంచారని అన్నారు. అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ... సమాజంలో మమ్మల్ని భాగస్వాములుగా చేయండి, మాకు అవకాశాలు ఇవ్వండి, మేము కూడా రాజ్యాధికారంలో భాగస్వామ్య దిశగా అన్ని పార్టీలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, అమృత, బీజేపీ నేతలు పాతకోటి మహేష్, అజయ్‌కుమార్, రమేష్ యాదవ్, మహంకాళి రవీందర్, శ్రీనివాస్, శంకర్, గోవింద్ పాల్గొన్నారు.

అలంకార సామగ్రి దుకాణంలో అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: అలంకార సామగ్రి దుకాణంలో అగ్ని ప్రమాదంతో ఆ సామగ్రి అంతా కాలిబూడిదైంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. బోయిగూడకు చెందిన రాజేశ్వరరావు, ఎన్నో ఏళ్ల నుంచి సుభాష్ రోడ్‌లో పగిడీలు, పెళ్లి అలంకరణ సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో షాపులో నుంచి దట్టమైన పొగలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. సుమారు రూ.3 లక్షల సామగ్రి కాలిపోయిందని బాధితులు తెలిపారు. విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నిరుద్యోగ భృతి వద్దు.. ఉద్యోగమే ముద్దు


మాట్లాడుతున్న కృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ భృతి వద్దు ఉద్యోగమే ముద్దు అని ఓయూ జేఏసీ చైర్మన్ ఒరుగంటి కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి, నిరుద్యోగుల పోరాట ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన మాజీ సీఎం కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసగించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీలోని కొందరు రాజకీయ నిరుద్యోగులు స్వలాభం కోసం మరోమారు నిరుద్యోగులను మోసగించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో యేసుబాబు, జాన్సీ, అనిల్‌కుమార్, ప్రమోద్, లక్ష్మణ్, మహదేవ్, సింహాద్రి, అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్‌ఐ సుభాష్ సమాచారం మేరకు... కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా బాలాజీ దర్శన్ హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించి ఉన్నాడు. మృతుడి ఒంటిపైన బ్లాక్ అండ్ వైట్ చెక్స్ షర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ఉంది. మృతుడు హిందూ బెగ్గర్ అని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కో–కన్వీనర్ రమాదేవి డిమాండ్ చేశారు. గురువారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, తరగతికి తగిన విద్యా సామర్థ్యాలు కూడా అందడం లేదని ఆరోపించారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ జరగడం లేదన్నారు. మండల పరిధిలో బడులకు దూరంగా ఉన్న 193 మంది పిల్లలు బాలకార్మికులుగా మారిపోయారన్నారు. వారిని పనుల నుంచి విముక్తి చేసి బాలకార్మిక రహిత మండలంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ప్రవీణ్, సీఆర్పీఎఫ్ కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణ, మల్లేష్, భాస్కర్, నరసింహ, భారతమ్మ, ప్రకాష్, సందీప్, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య పాల్గొన్నారు.



లాలాపేట ప్రధాన రహదారిలో ఉదయం, సాయంత్రం వేళలో తీవ్రమైన ట్రాఫిక్ జామ్ నెలకొంటుంది. ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంతతో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. ఈ మార్గంలో వెళ్లే వాహన దారులతో పాటు ఎమర్జెన్సీ అంబులెన్సుల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది తలెత్తుతోంది. సంబంధిత అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. లాలాపేట ప్రధాన రహదారిలో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – లాలాపేట

'గాంధీ'లో సందడిగా క్రిస్మస్ వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గురువారం క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏసుక్రీస్తు జననం సమస్త మానవాళికి శుభ సంకేతమన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అన్నారు. అనంతరం క్యాండిల్ లైట్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆటపాటలతో సందడి చేసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, ప్రభుకిరణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 ఇందిరా, గ్రేడ్–2 రోషలిన్, స్టాఫ్‌నర్సులు బెన్నెట్, ఫ్లోరెన్స్, శారద, సునీత పాల్గొన్నారు.

కుమ్మర్ల ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలి

లాలాపేట: ఈ నెల 24న నిర్వహించనున్న కుమ్మర్ల ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలనీ కుమ్మర జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు దునుకు వేలాద్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, సలహాదారు హరినాథ్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉప్పల్ కళ్యాణపురిలోని కిడ్స్ ఫ్రీ పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని కుమ్మర్ల అభివృద్ధి, నామినేటెడ్ పదవుల్లో అవకాశం, రాజ్యాధికారంలో సముచితమైన ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశం ద్వారా కుమ్మర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నేడు ప్రభుత్వ యూనివర్సిటీలపై మేధోమథనం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఏం కోరుకుంటున్నాయి? అనే అంశంపై నేడు (22న) ఓయూ ఆర్ట్స్ కాలేజీలో మేధో మథనం జరగనుంది. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పొలిటికల్ సైన్స్ విభాగం సెమినార్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి ఓయూ విశ్రాంత అధ్యాపకులు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ.కోదండరామ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఏఐఎస్‌ఎఫ్ నేత నెల్లి సత్య తెలిపారు.

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తామని మంత్రి పొన్నం హామీ


మంత్రి పొన్నంకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హిమాయత్‌నగర్: కార్మికుల సంక్షేమం, హక్కులు, చట్టాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వారికి త్వరలో న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోదాం మల్లేష్ గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు శంకర్ లాల్ రామావత్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బందం గురువారం మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ ఆటో డ్రైవర్లకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఇ.నాగరాజు, మల్లేష్, శంకర్, బొడ్యానాయక్, రాములునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379